# సాక్షి
## అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం, 5, సెప్టెంబర్, 2023






**పెదబయలులో భారీ వర్షం**

పెదబయలు: మండలంలో సోమవారం సాయంత్రం కుండపోత వర్షం పడటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమైంది.




**ఏపీవీవీపీ ఆస్పత్రుల్లో పలు పోస్టుల భర్తీ** IIలో

ఏపీ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో పలు ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.



**పారదర్శకంగా సేవలు**

గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పారదర్శకమైన సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అన్నారు. IIలో

## న్యూస్‌రీల్

### నాణ్యత, ఉపయోగకరంగా జగనన్న విద్యాకానుక కిట్లు

- సమగ్ర శిక్ష సీఎంఓ జ్ఞానప్రకాష్
- ఈనాడు కథనం అవాస్తవమని వెల్లడి



సొవ్వ పాఠశాలలో దర్యాప్తు నిర్వహిస్తున్న సీఎంఓ జ్ఞానప్రకాష్

**డుంబ్రిగుడ:** మండలంలోని సొవ్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో బూట్లు సరిపోక పాట్లు అనే శీర్షికతో ఈ నెల 4వ తేదీన ఈనాడులో ప్రచురితమైన కథనంలో ఏమాత్రం వాస్తవం లేదని సమగ్ర శిక్ష (ఎస్ఎస్ఏ) సీఎంఓ జ్ఞానప్రకాష్ పేర్కొన్నారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఆయన పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడిన ఆయన ఇందుకు సంబంధించి వివరాలను వెల్లడించారు. ఈ నెల 3న ఆదివారం కావడంతో వసతి గది శుభ్రం చేసే ముందు బూట్లు బయటకు తీసుకువచ్చి మెట్లు వద్ద ఉంచారన్నారు. తరువాత బూట్లను గదిలోకి తీసుకువెళ్లినట్టు విద్యార్థులు తెలిపారన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన విద్యాకానుక కిట్లు నాణ్యతగా ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని విచారణలో విద్యార్థులు తెలిపారని ఆయన పేర్కొన్నారు.

### పర్యాటక ప్రాంతంగా అభివృద్ధికి కసరత్తు

- గురమంద విశ్వనాథుని ఆలయం వద్ద సర్వే చేపట్టిన అటవీశాఖ అధికారులు



సర్వే నిర్వహిస్తున్న రేంజి అధికారి షహెన్‌షా, సిబ్బంది

**వై.రామవరం:** మండలంలోని యార్లగడ్డ పంచాయతీ అటవీ ప్రాంతంలోని గురమంద విశ్వనాథుని ఆలయ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కసరత్తు మొదలైంది. దీనిలో భాగంగా సోమవారం అడ్డతీగల అటవీ రేంజ్ అధికారి ఎస్.షహెన్‌షా ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. నివేదికను రంపచోడవరం డీఎఫ్‌వో నరేంద్రియన్‌కు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. డిప్యూటీ రేంజ్ అధికారి సీహెచ్ సత్యనారాయణ, బీట్ ఆఫీసర్ సురేష్ పాల్గొన్నారు.

### బాధ్యతగా పనిచేయాలి



సూచనలిస్తున్న అదనపు ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్

**చింతపల్లి:** ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులను నిర్వాహకులు జాగ్రత్తగా చూసుకోవాలని స్థానిక అదనపు ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్ ఆదేశించారు. సోమవారం మండలంలోని పలు పాఠశాలల హెచ్‌ఎంలు, వార్డెన్లు, ఏటీడబ్ల్యూవోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులపై పర్యవేక్షణ పెంచడంతో పాటు వారు పాఠశాల నుంచి అనుమతులు లేకుండా బయటకు వెళ్లకుండా చూసుకోవాలన్నారు. పాఠశాలల్లో ఎటువంటి సంఘటనలు జరిగినా సంబంధిత నిర్వాహకులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి, ఎస్ఐ అరుణ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### భూసిపుట్టు ఉప సర్పంచ్‌గా లలితకుమారి



లలితకుమారికి ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఆర్వో కృష్ణమూర్తి

**ముంచంగిపుట్టు:** మండలంలోని భూసిపుట్టు ఉప సర్పంచ్ స్థానానికి సోమవారం నిర్వహించిన ఎన్నికలో లలితకుమారి ఎన్నికయ్యారని మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి కృష్ణమూర్తి తెలిపారు. పంచాయతీ పరిధిలో 10 మంది వార్డు మెంబర్లు ఉండగా వీరిలో ఆరుగురు లలితకుమారికి మద్దతు తెలిపారన్నారు. ఈ మేరకు ఆమెకు ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని ఆయన అందజేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో స్థానిక ఎస్ఐ రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు గస్తీ నిర్వహించారు. ఈవోపీఆర్డీ చిన్నాన్న పాల్గొన్నారు.

## సీతమ్మ కొండకు పతాకస్థాయి గౌరవం

సీతమ్మకొండ అద్భుత ఘట్టం ఆవిష్కరణకు వేదికైంది. హర్ శిఖర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. నిమాస్ డైరెక్టర్ కల్నల్ రణవీర్‌సింగ్ నేతృత్వంలో 14 మందితో కూడిన ఆర్మీ బృందం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించింది. దేశంలోని 28 రాష్ట్రాల్లో ఇప్పటివరకు 22 చోట్ల ఎగురవేశారు. మిగతా ఆరు రాష్ట్రాల్లో వచ్చేనెల 15లోగా ఆవిష్కరణ పూర్తి చేయనున్నారు.



సీతమ్మ కొండ ఎక్కుతున్న కల్నల్ రణవీర్‌సింగ్ జమ్వాల్,ఇతర ఆర్మీ బృందం

- ఘనంగా హర్ శిఖర్ తిరంగా
- మురిసిన మువ్వన్నెల జెండా
- అద్భుత ఘట్టానికి వేదిక
- ప్రకృతి రమణీయత అద్భుతం: ఆర్మీ బృందం



నిమాస్ డైరెక్టర్ కల్నల్ రణ వీర్‌సింగ్ జమ్వాల్‌కు స్వాగతం పలుకుతున్న ఓలుబెడ్డ గిరిజనులు

**సాక్షి,పాడేరు:** హుకుంపేట మండలంలోని సీతమ్మ కొండపై పండగ వాతావరణం నెలకొంది. హర్ శిఖర్ తిరంగాలో భాగంగా సోమవారం జాతీయజెండా ఆవిష్కరణతో అరుదైన ఖ్యాతి దక్కింది. ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటనీరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్ (నిమాస్) డైరెక్టర్ కల్నల్ రణవీర్‌సింగ్‌జమ్వాల్ నేతృత్వంలో 14 మందితో కూడిన ఆర్మీ బృందం, తెలంగాణకు చెందిన 2014 ఎవరెస్ట్ పర్వతారోహకుడు ఆనంద్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఓలుబెడ్డ నుంచి 1.30కు బయలుదేరి సీతమ్మ కొండకు మధ్యాహ్నం 3 గంటలకు చేరుకున్నారు. జెండా కర్ర వద్ద జాతీయ పతాకాన్ని ఎగురవేసి, గౌరవ వందనం సమర్పించారు. అక్కడ కొంతసేపు గడిపారు. ఆ ఆనంద క్షణాలను ఉన్నతాధికారులతో పంచుకున్నారు.

**ఘన స్వాగతం**

ఓలుబెడ్డలో బృందం సభ్యులకు గిరిజనులు ఘన స్వాగతం పలికారు. సంప్రదాయ పద్ధతిలో వారికి నుదుటిన బొట్టు పెట్టి యాత్రకు ఆహ్వానించారు. బృందం సభ్యులు గిరిజనులతో కలిసి థింసా నృత్యం చేశారు. కొండపైకి చేరుకున్న బృందం సభ్యులు ప్రకృతి అందాలకు మంత్రముగ్ధులయ్యారు.

**దేశ సమైక్యతను పెంపొందించుకోవాలి:**

కల్నల్ రణవీర్‌సింగ్ జమ్వాల్ గిరిజన ప్రాంతాల్లో యువతీ,యువకులు చదువుతోపాటు దేశ సమైక్యత పెంపొందించేందుకు కృషి చేయాలని ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటనీరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్(నిమాస్) డైరెక్టర్ కల్నల్ రణవీర్‌సింగ్‌జమ్వాల్ సూచించారు. జెండా ఆవిష్కరణ అనంతరం హుకుంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు 21 రాష్ట్రాల్లోని ఎత్తయిన పర్వతాల్లో హర్ శిఖర్ తిరంగా మిషన్ ద్వారా జాతీయ జెండాను ఎగురవేశామని తెలిపారు. జాబితాలో 22వ జెండా ఆవిష్కరణ సీతమ్మకొండ నమోదైందన్నారు. ఇప్పటివరకు జెండా ఆవిష్కరించిన శిఖరాల్లో సీతమ్మకొండపై ప్రకృతి రమణీయత అద్భుతమన్నారు. ఇక్కడ గిరిజనుల ఆత్మీయత ఎన్నటికీ మరువలేమన్నారు. విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని సూచించారు. ఆర్మీలో చేరి దేశానికి సేవ చేసేందుకు ముందుకు రావాలని ఆకాంక్షించారు. సాహసయాత్రలు, సాహస క్రీడల్లో పాల్గొనేందుకు గిరిజన యువతీ.యువకులు ముందుకు వస్తే తమ నిమాస్ సంస్థ అన్ని విధాలుగా సహకారం అందిస్తుందన్నారు. ఏపీకి సంబంధించి గిరి యువకుడు కుంతూరు కృష్ణ ప్రసాద్ అన్ని విధాలా సహకారం అందిస్తున్నారన్నారు.



సీతమ్మ కొండపై జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం ఆర్మీ బృందం



హుకుంపేట జూనియర్ కళాశాల విద్యార్థులు,అధ్యాపకులతో ఆర్మీ బృందం



కల్నల్ రణవీర్ సింగ్ జమ్వాల్‌ను సత్కరిస్తున్న హుకుంపేట జూనియర్ కళాశాల యాజమాన్యం



గిరిజనులతో కలిసి థింసా నృత్యం చేస్తున్న కల్నల్ రణవీర్ సింగ్ జమ్వాల్ తదితరులు

## ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోండి

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్
- శిక్షణకు 399 మంది ఎంపిక



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

**పాడేరు రూరల్ :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వేతనదారుల పిల్లలకు సీడాప్ అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాల్లో స్థిరపడాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల మండలాలకు చెందిన అభ్యర్థులకు ఎంపిక కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకున్న కూలీల పిల్లలకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో కూడిన శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని చెప్పారు. శిక్షణ కాలంలో ఒక్కో అభ్యర్థికి రూ.272ల ఉపకార వేతనం కూడ అందిస్తారన్నారు. శిక్షణ పొందుతున్న అభ్యర్థుల బ్యాంకు ఖాతాల్లో ప్రతి 15 రోజులకు ఒకసారి జమ చేస్తారని తెలిపారు. మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఎస్ఆర్టీసీ, వైస్ మెన్‌పవర్ సొల్యూషన్స్, డేటా ప్రో, కైట్స్ సంస్థల ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తారని తెలిపారు. ఏజెన్సీ 2400 మందికి శిక్షణ ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నామని పీవో పేర్కొన్నారు. పాడేరులో నిర్వహించిన ఎంపికలో మూడు మండలాల నుంచి 399 మంది హాజరు కాగా అందరిని ఎంపిక చేసినట్టు ఆయన తెలిపారు. ఈనెల 7న పెదబయలు, ముంచంగిపుట్టు, 8న అనంతగిరిలో 9న అరకులోయ, డుంబ్రిగుడ, 13న చింతపల్లి, జీకే వీధి, 16న కొయ్యూరు మండలాల్లో నిర్వహించే ఎంపికల్లో అభ్యర్థులు ఏ మండలానికి చెందిన వారైన హాజరు కావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి పథకం ఏపీడీ జవ్వాది గిరిబాబు, పాడేరు ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటరావు, జేడీఎం కళ్యాణి, ఉపాధి, వెలుగు సిబ్బంది, అధిక సంఖ్యలో అభ్యర్థులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు నేడు సత్కారం

- ఐటీడీఏ కాఫీ అతిథి గృహంలో కార్యక్రమం
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ

**సాక్షి,పాడేరు:** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాలోని ఉత్తమ ఎంఈవోలు, హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు,ఎస్జీటీలను స్థానిక ఐటీడీఏ కాఫీ అతిథి గృహంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన సత్కరించనున్నారు. ఉపాధ్యాయులకు సోమవారం క్రీడా పోటీలు నిర్వహించారు.

**ఉత్తమ ఎంఈవోలు**

హుకుంపేట ఎస్ చెల్లయ్య, పాడేరు ఎస్ రామచంద్రరావు, జి.మాడుగుల ఎంఈవో-1 సీహెచ్.బాబురావు

**ప్రధానోపాధ్యాయులు..**

ప్రభాకరరావు (పాడేరు ఈఎంఆర్), బీఎస్ కుమార్ (మారేడుమిల్లి), ఎస్.రాజేశ్వరి(ఇర్లపల్లి), పి.సుభద్ర( గాంధీనగరం), బి.గోపాలరాజు (కిముడుపల్లి), పి.నిర్మల (జోలాపుట్టు), ఎస్.విశ్వప్రసాద్ (పాడేరు జీహెచ్ఎస్ గ్రేడ్-2 హెచ్‌ఎం), కె.సువర్ణరాజు (హుకుంపేట జీహెచ్ఎస్ గ్రేడ్-2 హెచ్‌ఎం ), సీహెచ్.గోపీనాథ్(చింతపల్లి).

**స్కూల్ అసిస్టెంట్లు..**

ఎల్.వెంకటేశ్వర్లు (దేవరాపల్లి), జి.రాంబాబు (వంగసార), పి.ప్రసాదరావు (పాడేరు), డి.టి.బాబు(రంపచోడవరం), కె.అప్పలనాయుడు (జోలాపుట్టు), డి.బాబూరావు (పెదబయలు), ఆర్.అనిల్( హుకుంపేట), కేజే రామారావు(పాడేరు), బి.రమణమూర్తినాయుడు (చింతపల్లి), బి.ఎస్.వరప్రసాద్ (కొత్తపాలెం), కె.కృష్ణపడాల్ (కొయ్యూరు), జి.వి.ఆర్.మూర్తి(కృష్ణాపురం), కె.రవికుమార్ (పెదబయలు), కె.దామోదరం (చొడుపల్లి), ఎ.అనిల్‌కుమార్(పెదబయలు), కె.మహేష్ (తాడేపల్లి), బి.తిరుపతిరావు (కొయ్యూరు), పి.కృష్ణకుమారి ( తురకలవలస), డి.వి.సూర్యనారాయణ (కిముడుపల్లి), కె.ఎస్.ఆనందకుమార్ (ఎల్లవరం), కె.చక్రధరరావు (డీఈవో ఆఫీస్), పి.ఈశ్వరరావు (డీఈవో ఆఫీస్).

**ఎస్జీటీలు..**

కె.రామకృష్ణ, జెఎల్.శంకరం, జి.వెంకటరమణ, కె.ఆనందరావు, పి.అచ్చయ్య, జి.నిర్మలాదేవి, పి.మల్లయ్య, బి.సునీల్‌కుమారి, ఎం.కబ్బారావు, ఎస్.సురేష్‌బాబు, జి.రమాప్రియ, ఎస్.మత్స్యలింగం, జి.మాధవరావు, జే.హనుమంతరావు, ఎస్.సత్యనారాయణ, డి.గంగాధరరావు, ఆర్.రత్నం, ఎస్.నూకరాజు, బి.శివరత్నం, బి.అచ్చిబాబు, వి.బొంజుబాబు, కె.సూర్యనారాయణ, బి.రాజుబాబు, పి.అప్పారావు, కె.వెంకటేశ్వరరావు, ఎస్.అజయ్‌కుమార్, ఎస్.అర్జున్, ఎస్.గురుదొర్, జి.సింహాద్రినాయుడు ఎంపికయ్యారు.

## ఎస్ఐ పరీక్షలకు 614 మంది హాజరు



పరుగు పోటీలో పాల్గొన్న పురుష అభ్యర్థులు

**ఆరిలోవ:** విశాఖ రేంజ్ పరిధిలో ఎస్ఐ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భాగంగా పురుష అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు మళ్లీ ప్రారంభమయ్యాయి. కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానంలో సోమవారం జరిగిన పరీక్షలకు 614 మంది హాజరయ్యారు. రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు గత నెల 25న ఇక్కడ దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. గత నెల 29 వరకు కొన్ని బ్యాచ్‌లకు పరీక్షలు జరిగాయి. ఆగస్టు 30 నుంచి ఈ నెల 2 వరకు మహిళా అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించారు. సోమవారం నుంచి మళ్లీ పురుష అభ్యర్థులకు పరీక్షలు మొదలయ్యాయి. 800 మందికి హాల్ టికెట్లు పంపించగా.. 614 మంది అభ్యర్థులు హాజరయ్యారు. రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ, విజయనగరం జిల్లా ఎస్పీ దీపికా ఎంపిక ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.

## ఉత్తమ సేవలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు

- రెండు విద్యాలయాల ప్రిన్సిపాళ్లకు ఉత్తమ అవార్డులు



పీఎస్ఎన్ మూర్తి



మయూరి లక్ష్మి

**సాక్షి, పాడేరు:** విద్యార్థుల ప్రగతికి బాటలు వేస్తున్న రెండు విద్యాలయాలకు చెందిన ప్రిన్సిపాళ్లు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. ఈ పురస్కారాలను ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వారు అందుకోనున్నారు.

**గణిత ఉపాధ్యాయుడిగా..**

అరకులోయలోని గిరిజన సంక్షేమ గురుకుల క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ పీవీఎస్ఎన్ మూర్తి ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు ఉంది. ఈయన 2016 నుంచి ఇక్కడ పనిచేస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని వి.మాడుగుల మండలం అప్పలరాజుపురం గ్రామానికి చెందిన ఆయన 2003లో జి.మాడుగుల గిరిజన సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా జాయిన్ అయ్యారు.ఆ తరువాత 2010లో పదోన్నతి లభించింది. అప్పటి నుంచి ఆయన పలు చోట్ల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ 2016లో అరకులోయ క్రీడా పాఠశాలకు బదిలీపై వచ్చారు. అప్పటి నుంచి గిరిజన గురుకుల క్రీడా పాఠశాల విద్యార్థులు చదువు, క్రీడల్లో రాణించడంలో ఆయన ఎంతో కృషి చేస్తున్నారు. 2003 నుంచి ఇప్పటివరకు నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో జిల్లాస్థాయి పురస్కారాలు పొందారు. ఐటీడీఏ పీవో చేతుల మీదుగా నాలుగు సార్లు, కలెక్టర్ల చేతుల మీదుగా మూడు సార్లు, స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ నుంచి రెండు సార్లు, క్రీడా ప్రతిభ అవార్డులు రెండు సార్లు పొందారు. తొలిసారిగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా గౌరవం దక్కనుండడంతో ఆయనను పలువురు అభినందించారు.

**విద్యార్థినుల ప్రగతికి బాటలు వేస్తూ..**

మారేడుమిల్లి కేజీబీవీ పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న మయూరి లక్ష్మి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రభుత్వ ఆశయం నెరవేరుస్తూ నాణ్యమైన విద్య అందించేందుకు ఆమె అందిస్తున్న సేవలకు గుర్తింపు లభించింది. జిల్లాలోని చింతూరు మండలం చట్టి గ్రామానికి చెందిన ఈమె 2019లో మారేడుమిల్లి కేజీబీవీ పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. టెన్త్‌లో ఏటా ఉత్తమ ఫలితాల సాధనలో ఆమె కృషి ఎంతో ఉంది.సెలవు దినాల్లో కూడా ఆమె విద్యాలయంలోనూ ఉంటూ ఉత్తమ విద్యా ప్రమాణాల సాధనపై ప్రత్యేక దృష్టి సారిస్తుంటారు. ఇక్కడి విద్యార్థినులతో ఆమె స్నేహితురాలుగా మెలుగుతారు. ఆమె పనితీరును విద్యాశాఖ అధికారులు అభినందించిన సందర్భాలు ఉన్నాయి. గత విద్యా సంవత్సరంలో ఇక్కడ కేజీబీవీలో చదివిన ఇంటర్ విద్యార్థిని బి.కృపావతి 746 మార్కులు సాధించింది. రాష్ట్రంలో ఇంటర్ హెచ్ఈసీ గ్రూప్‌లో అధిక మార్కులు సాధించిన ఆమెకు జగనన్న ఆణిముత్యాలులో చోటు దక్కింది. ఇలా ఉత్తమ ప్రమాణాల సాధనలో ప్రిన్సిపాల్ కృషి ఎంతో ఉంది.

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న ఆర్‌జేడీ చిన్మయిదేవి, పీడీ సూర్యకుమారి



పౌష్టికాహార వంటకాల ప్రదర్శనను తిలకిస్తున్న ఆర్‌జేడీ, పీడీ తదితరులు

- ఐసీడీఎస్ ఆర్‌జేడీ చిన్మయిదేవి

**సాక్షి,పాడేరు:** పౌష్టికాహారాన్ని సక్రమంగా తీసుకోవడంవల్ల గర్భిణులు, బాలింతలు,చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ ఆర్‌జేడీ చిన్మయిదేవి తెలిపారు. సోమవారం పట్టణంలోని గుడివాడ ప్రధాన అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పౌష్టికాహార ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తయారుచేసిన పౌష్టికాహార వంటలు, చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలను ప్రదర్శించారు. వాటిని సందర్శించిన ఆర్‌జేడీ ఆయా అంగన్‌వాడీ సిబ్బందికి అభినందనలు తెలిపారు. అనంతరం ఆర్‌జేడీ చిన్నారులకు అన్న ప్రాసన, గర్భిణులకు సాముహిక సీమంతాలు నిర్వహించారు. అలాగే అంగన్‌వాడీలో ప్రీస్కూల్ చిన్నారులకు పుస్తకాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ ను అమలు చేస్తుండటంతో మరింత నాణ్యమైన పౌష్టికాహారం అందుబాటులోకి వచ్చిందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సంపూర్ణ పౌష్టికాహారం అందుతుందని ఆమె పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న కూరగాయలు, ఆకుకూరలతో పాటు చిరుధాన్యాలను గర్భిణులు, బాలింతలు వినియోగించాలని సూచించారు. రక్తహీనత నివారణే లక్ష్యంగా పౌష్టికాహారం అందిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, సీడీపీవో ఝాన్సీరాణి, సూపర్‌వైజరు ఉర్మిళ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల మధ్య అంతర్గత రోడ్లకు ప్రాధాన్యం

- ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్



పనుకురాతిపాలెం-జడేరు రోడ్డు పనులకు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ధనలక్ష్మి,ఎమ్మెల్సీ అనంతబాబు



కొత్తగా మంజూరైన పింఛన్ల నగదును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి,ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్

**అడ్డతీగల:** గ్రామాల మధ్య అంతర్గత రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి,ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ పేర్కొన్నారు. మండలంలోని పనుకురాతిపాలెం-జడేరు గ్రామాల మధ్య రూ.2.50 కోట్ల అంచనాతో నిర్మించనున్న మెటల్ రోడ్డు పనులను భూమి పూజ నిర్వహించి ప్రారంభించారు. అనంతరం ధాన్యంపాలెం-రావిగూడెం గ్రామాల మధ్య రూ.2.50 కోట్ల అంచనా వ్యయంతో మూడు కిలోమీటర్ల మేర చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ధాన్యంపాలెంలో రూ.71.75 లక్షలతో నిర్మించిన సచివాలయ అనుబంధ భవనాలనుప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు అధిక ప్రాధాన్య మిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ముఖ్యమైన గ్రామాల మధ్య రాకపోకలు సాగించేందుకు అనువుగా రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, వైస్ ఎంపీపీ కరణం సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ తోట రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు**

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పేర్కొన్నారు. కొత్తగా మంజూరైన 212 వివిధ రకాల పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పింఛను నగదును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల మతాలు, పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొడ్డపాటి రాఘవ,వైస్ ఎంపీపీ కరణం సత్యనారాయణ, ఎంపీడీవో కె.బాపన్నదొర, సొసైటీ చైర్మన్ తోట రాజేశ్వర్రావు, జేసీఎస్ కన్వీనర్ నక్కా మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఏపీవీవీపీ ఆస్పత్రుల్లో పలు పోస్టుల భర్తీ

దరఖాస్తుకు ఈ నెల 9 ఆఖరు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్(ఏపీవీవీపీ) ఆస్పత్రుల్లో పలు ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆడియో మెట్రీషియన్, డెంటల్ టెక్నీషియన్, రేడియో గ్రాఫర్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో, థియేటర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్, ఆఫీసు సబార్డినేట్ పోస్టులను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేస్తామని కలెక్టర్ ఎ.మల్లికార్జున ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు అన్ని ధ్రువీకరణపత్రాల జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేయాలని సూచించారు. దరఖాస్తులను ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఆస్పత్రుల సేవల సమన్వయ అధికారి వారి కార్యాలయం, గవర్నమెంట్ ఆస్పత్రి, పెందుర్తి కార్యాలయంలో అందజేయాలని జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయాధికారి టి.రమేష్ కిశోర్ తెలిపారు. విద్యార్హతలు, ఖాళీల వివరాలు, వయో పరిమితి, ఇతర వివరాలను https:// visakhapatnam.ap.gov.inలో పొందుపరిచినట్లు చెప్పారు.

### జీ-20 సదస్సుపై అవగాహన



పి.యర్రగొండ ఏకలవ్య పాఠశాలలో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో సోమవారం ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ ఆధ్వర్యంలో జీ-20 సదస్సుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జీ 20 యొక్క ప్రాముఖ్యతను పలువురు విద్యార్థులు తెలియజేశారు. మన దేశంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు పాల్గొననున్న దేశాలు, చర్చించనున్న వివిధ అంశాల గురించి, విద్యార్థులకు వివరించారు. ఇందులో భాగంగా జీ-20 మాక్ సదస్సును విద్యార్థులు నిర్వహించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దశాబ్దాల కల.. సాకారమైన వేళ

ఏళ్ల తరబడి పరిష్కారం కాని సమస్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిష్కారమవడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బాలారం నుంచి కించెలి అవతల వరకు రోడ్డు అధ్వానంగా ఉండేది. గడచిన 20 సంవత్సరాల నుంచి రోడ్డు వేయాలని స్థానికులు పాలకులు, అధికారులకు వినతులు ఇస్తూనే ఉన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి సమావేశాల సమయంలో లెక్కలేనన్ని సార్లు వినతులు ఇచ్చారు. అయినా సాధ్యం కాలేదు. అటు అనకాపల్లి.. ఇటు అల్లూరి జిల్లాలను కలిపే ఈ రోడ్డు ఇప్పుడు పూర్తిగా మారింది. మొత్తం సీసీ వేశారు. బాలారం నుంచి కించెలి వరకు రోడ్డు పూర్తవడంతో ప్రయాణికుల బాధలు తగ్గాయి.

- ఆడాకుల–బాలారం రోడ్డుకు మహర్దశ
- రూ.4.57 కోట్ల నిధులు
- పూర్తయిన వంతెన పనులు
- అనకాపల్లి, అల్లూరి జిల్లాల సరిహద్దు ప్రజలకు తీరిన రహదారి కష్టాలు





ఆడాకుల–బాలారం సీసీ రోడ్డు (ఇన్‌సెట్) పనుల వివరాల బోర్డు

కొయ్యూరు: ఒకప్పుడు అనకాపల్లి జిల్లా నాతవరం నుంచి అల్లూరి జిల్లాలో రాజవొమ్మంగి లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే వాహనచోదకులు పడరాని పాట్లు పడేవారు. కించెలి నుంచి బాలారం వరకు సుమారు ఎనిమిది కిలోమీటర్ల మట్టిరోడ్డు పెద్ద పెద్ద గోతులతో అధ్వానంగా ఉండేది. కొందరైతే ఈ దారికి బదులుగా మరో మార్గంలో వెళ్లేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఏజెన్సీలో రహదారుల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా 2022లో బాలారం నుంచి ఆడాకుల వరకు ఎనిమిది కిలోమీటర్ల రోడ్డుకు రూ.4.57 కోట్ల ఏపీఆర్ఆర్‌పీ నిధులు విడుదల చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ కూడా పనులను వేగంగా చేశారు. ఎనిమిది నెలల వ్యవధిలోనే మొత్తం పనులు పూర్తి చేశారు. ఈ మార్గంలో బాలారం దాటిన తరువాత పాత వంతెన వల్ల రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అయితే కొత్త వంతెనను ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఎంత వర్షం కురిసినా రాకపోకలు సులువుగా సాగించవచ్చు. ప్రస్తుతం అనకాపల్లి, అల్లూరి జిల్లాల నుంచి అటు ఇటుగా రాకపోకలు సాగిస్తున్నారు. కొయ్యూరు నుంచి రాజవొమ్మంగి మధ్య దాదాపుగా ఐదు కిలోమీటర్ల మేర పాడైన రోడ్డును కూడా బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.

### గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి



రెండు దశాబ్దాలకు పైగా బాలారం నుంచి ఆడాకుల వరకు మట్టిరోడ్డుతో నరకం చూసేవారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా రోడ్డు రాలేదు. ఈ ప్రభుత్వం కూడా వేయించలేదని కొందరు ఎగతాళి చేశారు. అలాంటి వారు నోర్లు ఇప్పుడు రోడ్డు వేయడం ద్వారా మూయించాం. మొత్తం సీసీ రోడ్డు కావడంతో ఏ కాలంలో అయినా సులువుగా రాకపోకలు సాగించే వీలు కలిగింది. ఈ ప్రభుత్వం రోడ్డు వేయడం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై చిత్తశుద్ధిని నిరూపించుకుంది.

– అప్పన వెంకటరమణ, వైస్ ఎంపీపీ, కొయ్యూరు

### రాకపోకలు సులభతరం



బాలారం నుంచి ఆడాకుల వరకు రోడ్డు పూర్తి కావడంతో రెండు జిల్లాల వారికి రాకపోకలు సాగించే వీలు కలిగింది. కాంట్రాక్టర్‌కు కూడా రోడ్డును త్వరితగతిన పూర్తి చేయాలని కోరాం. దీంతో పనులను త్వరగా పూర్తి చేశారు. ఈ ప్రాంత ప్రజల రవాణా కష్టాలు తీరాయి.

–ఈశ్వరరావు, ప్రాజెక్ట్ డీఈ, చింతపల్లి

## 'గిన్నిస్ బుక్'లో తేజేశ్వరరావుకు చోటు

అక్కిరెడ్డిపాలెం: గాజువాకలోని ఎంవీఆర్ డిగ్రీ, పీజీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పూణ్ణ తేజేశ్వరరావు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద పుస్తక రచనలో ఆయన భాగమయ్యారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ వి.రామారావు ఆయన్ని అభినందించారు. కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.బాలకృష్ణ మాట్లాడారు. తమిళనాడుకు చెందిన ఈఎస్ఎన్ పబ్లికేషన్ సంస్థ 1,00,100 పేజీలతో 19.34 అడుగుల ఎత్తు కలిగిన వరల్డ్ 2023 వైడ్ అవుట్ కం అన్ రీసెర్చ్ అండ్ లేటెస్ట్ డెవలప్‌మెంట్ అనే పుస్తకాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ పుస్తకంలో తేజేశ్వరరావు 25 చాప్టర్స్‌ను రచించినట్లు చెప్పారు. తేజేశ్వరరావు అరుదైన ఘనత సాధించడంపై సంతోషం వ్యక్తం చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఎస్.కృష్ణారావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ప్రొఫెసర్‌ను అభినందించారు.



రికార్డ్స్ ధ్రువీకరణ పత్రాన్ని స్వీకరిస్తున్న ప్రొఫెసర్ తేజేశ్వరరావు

## రైవాడ జలాశయంలో బోటు బోల్తా

గల్లంతైన రైతు మృత్యువాత



మృతుడు వెంకట జోగారావు (ఫైల్)

దేవరాపల్లి: మండలంలోని రైవాడ జలాశయం అవతలి వైపు పొలానికి వెళ్తున్న బోటు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రైవాడ గ్రామానికి చెందిన చల్లా వెంకట జోగారావు (43) మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. శనివారం మధ్యాహ్నం జలాశయం అవతలి వైపు పొలానికి వెళ్తుండగా ఈదురు గాలుల ధాటికి బోటు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జోగారావు జలాశయంలో గల్లంతయ్యాడు. శనివారం రాత్రికి ఇంటికి రాకపోవడంతో అతడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు రెండు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున జలాశయంలో మృతదేహం లభ్యమైంది. కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచిన అతడు విగతజీవిగా కనిపించడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. దీంతో రైవాడలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య పైడిరాజు, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపారు.

## భీమిలిలో భీమా సందడి

కొమ్మాది: ప్రముఖ నటుడు గోపీచంద్, రెడ్ సినిమా ఫేమ్ మాళవిక శర్మ హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న భీమా సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను భీమిలి బీచ్‌లో సోమవారం చిత్రీకరించారు. హీరో గోపీచంద్, నాజర్‌పై సన్నివేశాలను షూట్ చేశారు. కన్నడ దర్శకుడు నిమ్మ హర్ష తెరకెక్కిస్తున్న సినిమాలో రఘుబాబు, చమ్మక్ చంద్ర తదితరులు నటిస్తున్నారు.

# క్రూయిజ్ డెస్టినేషన్‌గా విశాఖ




సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర పోర్టులు, షిప్పింగ్ శాఖ మంత్రి శర్బానంద్ సోనోవాల్, చిత్రంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్, మేయర్ హరివెంకటకుమారి, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, సత్యవతి, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు

- వైభవంగా క్రూయిజ్ టెర్మినల్ ప్రారంభోత్సవం
- రాష్ట్ర మంత్రి అమర్‌నాథ్‌తో కలిసి టెర్మినల్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి శర్బానంద్
- మరో మూడు ప్రాజెక్టులను ప్రారంభం

దొండపర్తి: విశాఖ పర్యాటకం కొంత పుంతలు తొక్కనుంది. అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్ ప్రారంభోత్సవంతో ప్రపంచ పర్యాటకులకు కేంద్రంగా మారనుంది. సిటీ ఆఫ్ డెస్టినీగా ఉన్న విశాఖ భవిష్యత్తులో క్రూయిజ్ పర్యాటకుల గమ్యస్థానంగా నిలవనుంది. సరికొత్త పర్యాటక అనుభూతిని పంచేందుకు విశాఖ పోర్టులో క్రూయిజ్ టెర్మినల్ అందుబాటులోకి వచ్చింది. ఈ క్రూయిజ్ టెర్మినల్ ప్రారంభోత్సవాన్ని పోర్టు అధికారులు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన కేంద్ర పోర్టులు, షిప్పింగ్ శాఖ మంత్రి శర్బానంద్ సోనోవాల్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌లకు మేళ తాళాలతో స్వాగతం పలికారు. ముందుగా సీఐఎస్ఎఫ్ సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం రూ.96 కోట్లతో నిర్మించిన ఈ టెర్మినల్‌ను ప్రారంభించారు. అలాగే పోర్టులో స్టాక్ యార్డుల ద్వారా ఉత్పన్నమయ్యే కాలుష్యాన్ని నియంత్రించేందుకు 33.8 కోట్లతో నిర్మించిన కవర్డ్ స్టోరేజ్ యార్డులను, 666 ట్రక్కులను పార్కింగ్ చేసుకొనే సౌలభ్యంతో రూ.36.05 కోట్లతో ట్రక్ పార్కింగ్ టెర్మినల్‌ను ప్రారంభించారు. అదే విధంగా పోర్టులో ఓఆర్ 1, 2, 3 బెర్తుల ఆధునీకరణ, సామర్థ్య విస్తరణతో పాటు రూ.167.66 కోట్ల కొత్త పనులకు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం నిర్వహించిన సభలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ విశాఖ సుందర నగరమని, క్రూయిజ్ టెర్మినల్ రాకతో పర్యాటక రంగంలో విశాఖ అంతర్జాతీయ ఖ్యాతిని మరింత ఆర్జిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో ప్రముఖ నగరాల్లో విశాఖ ఒకటని పేర్కొన్నారు. విశాఖ అభివృద్ధిలో పోర్టు పాత్ర కీలకమని చెప్పారు. విశాఖలో కాలుష్య నియంత్రణకు కూడా పోర్టు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఇందులో భాగంగా కవర్డ్ స్టోరేజ్ యార్డులను నిర్మించినట్లు తెలిపారు.

**క్రూయిజ్ డెస్టినీగా విశాఖ**

సిటీ ఆఫ్ డెస్టినీగా ఉన్న విశాఖ భవిష్యత్తులో క్రూయిజ్ డెస్టినీగా కూడా మారుతుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. రాష్ట్ర పర్యాటకాభివృద్ధికి ఈ క్రూయిజ్ టెర్మినల్ మరింత దోహదంగా నిలుస్తుందన్నారు. ఈ టెర్మినల్ ద్వారా పర్యాటకులకు పూర్తిస్థాయిలో సేవలు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందని చెప్పారు.

**ఆర్థికాభివృద్ధికి ఊతం**

ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేందుకు ఈ క్రూయిజ్ టెర్మినల్ కీలకంగా నిలవనుందని విశాఖ పోర్టు అథారిటీ చైర్మన్ అంగముత్తు తెలిపారు. ఇది దేశ, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని వెల్లడించారు. పర్యాటకాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు సరికొత్త ఉద్యోగాలు, ఉపాధి కల్పనకు బాటలు పడతాయని చెప్పారు. పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దుబే వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, విశాఖ ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ, అనకాపల్లి ఎంపీ బి.వి.సత్యవతి, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, ఎమ్మెల్యేలు తిప్పలనాగిరెడ్డి, గణబాబు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా సేవలు

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలందరికీ పారదర్శకమైన సేవలు అందుతున్నాయని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని గెమ్మెలి గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో మరెక్కడ లేని విధంగా గ్రామ సచివాలయ వ్యవస్థను సీఎం జగన్‌మోహన్ రెడ్డి తీసుకువచ్చారన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు ఒకేచోట ఉండి పని చేసుకోనే విధంగా ఈ వ్యవస్థకు రూపకల్పన చేశారన్నారు. ఫలితంగా ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన అందుతోందన్నారు. జి.మాడుగుల మండలంలో 18 సచివాలయాలకు గాను ఐదు సచివాలయాలు ప్రారంభించినట్టు చెప్పారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకమైన సేవలు అందించేటువంటి వ్యస్థను తీసుకువచ్చిన సీఎం జగనన్నకు గిరిజనుల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నట్టు ఆమె చెప్పారు. ప్రభుత్వం గ్రామాల్లో రూ.40లక్షలతో నిర్మిస్తున్న గ్రామ సచివాలయం, రూ.21.80లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.32లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్, నాడు–నేడు ద్వారా చేపడుతున్న పాఠశాలల నిర్మాణాలు అభివృద్ధిని సూచించడం లేదా..అని ప్రతిపక్షాలను ప్రశ్నించారు. పాఠశాలలకు కొత్త భవనాలు నిర్మించటం, పాతవాటికి మరామ్మతులు చేయటం, మౌలిక సదుపాయాలు ఏర్పాటు, ప్రహరీ నిర్మాణాలతో కూడిన సదుపాయాలు, పాఠశాలలో ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ప్రభుత్వం చేస్తున్న ప్రగతిపై ప్రతిపక్షాల చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని, రానున్న రోజుల ప్రతిపక్ష పార్టీలకు సరైన విధంగా గుణపాఠం చెబుతారన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పకొట్టాలని ఆమె పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, ఎంపీడీవో చంద్రశేఖరరావు,

సర్పంచ్‌లు సీదరి కొండబాబు, కిముడు రాంబాబు, మసాడి గంగరాజు, ఎస్.మాలన్న, ఎంపీటీసీలు గబ్బాడి సన్యాసిదొర, కూడా చిన్నారావు, మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.మత్స్యకొండంనాయుడు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగూరుబాబు, వైస్ సర్పంచ్ జి.మురళి, సచివాలయ కనీ్వనర్లు గణపతి, సూర్యప్రకాష్ నాయుడు, సోషల్ మీడియా కన్వీనర్ లక్ష్మణ్, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు నీలమ్మ, నాయకులు లక్ష్మినాయుడు, సింహాచలం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అదుపు తప్పిన వేగం.. ప్రమాద బీభత్సం

- ఆగి ఉన్న ఆటో, ద్విచక్ర వాహనాలను ఢీకొన్న విద్యుత్ బోర్డు వాహనం
- ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాద దృశ్యం

చోడవరం రూరల్: అదుపు తప్పిన వేగంతో వస్తున్న ఏపీఈపీడీసీఎల్ వాహనం గోవాడ గ్రామంలోని భారతీయ స్టేట్ బ్యాంక్ వద్ద బీభత్సం సృష్టించింది. ఈ ప్రమాదంలో ఆగి ఉన్న ఆటోతోపాటు మరో నాలుగు ద్విచక్ర వాహనాలు నుజ్జయ్యాయి. ఆటోలోని ఇద్దరు, బ్యాంకు నుంచి వస్తున్న పాదచారి ఒకరు తీవ్ర గాయలతో ఆస్పత్రి పాలయ్యారు. చోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు కథనం ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో అనకాపల్లి నుంచి చోడవరం వైపు వస్తున్న వాహనాన్ని డ్రైవర్ తుపాకుల ప్రకాశరావు నడుపుతున్నారు. అదుపు తప్పిన వేగంతో వస్తున్న వాహనం గోవాడ భారతీయ స్టేట్ బ్యాంకు వద్దకు వచ్చేసరికి ఎడమ వైపున బ్యాంకు పనుల నిమిత్తం ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టింది. అదే వేగంతో ముందుకు దూసుకుపోవడంతో బ్యాంకు ఎదుట నిలిపి ఉన్న నాలుగు ద్విచక్ర వాహనాలపై నుంచి వెళ్లడంతో ఆ వాహనాలు దెబ్బతిన్నాయి. ఆటోలో ఉన్న అంభేరుపురం గ్రామానికి చెందిన డ్రైవర్ ఆడారి గోవిందరావు, ప్రయాణికురాలు దాడి లక్ష్మిలతోపాటు బ్యాంకు పని ముగించుకుని బయటకు వస్తున్న గోవాడ గ్రామానికి చెందిన ఏడువాక అప్పలస్వామిలు తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రమాదంలో గాయపడిన వారిని అక్కడి వారు హుటాహుటిన ఆటోల్లో చోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయాల తీవ్రత దృష్ట్యా వీరు ముగ్గురిని విశాఖ కింగ్ జార్జి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు సీఐ చెప్పారు. ప్రమాదానికి కారకుడైన వాహనం డ్రైవర్ ప్రకాశరావు అక్కడి నుంచి పరారై, చోడవరం పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. విశాఖలోని క్షతగాత్రుల నుంచి వాంగ్మూలాలను సేకరించి ఆటో డ్రైవర్ గోవిందరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

## గిరిజన గ్రామాలకు అక్షరోదయం

పీత్రుగెడ్డలో పాఠశాల ప్రారంభంపై హర్షం



గిరిజన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో వలంటీర్, ఎంఈవోలు జానుప్రసాద్, జగ్గారావు

రోలుగుంట: ఆ గిరిజన గ్రామాలకు తొలిసారిగా అక్షరోదయం కలిగింది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు ప్రభుత్వ పాఠశాల లేకపోవడంతో గిరిజనులంతా చదువుకు దూరమయ్యారు. ఈ గ్రామాలకు చెందిన వారు కొండ కింద ఉన్న శరభవరం గ్రామానికి ఎనిమిది కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి చదువుకోవడం కష్టం కావడంతో కొంతమంది దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకునేవారు. ఈ నేపథ్యంలో ఎన్.ఆర్.ఎస్.టి.సి. కింద పాఠశాల మంజూరైంది. గిరిజన పంచాయతీ అర్ల శివారు పీత్రుగెడ్డలో సోమవారం ఆ పాఠశాలను ఎంఈవో- 1, 2 జానుప్రసాద్, జగ్గారావు, స్థానిక సర్పంచ్ వండల వనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో లోసింగి, చినగెడ్డ, పెదగెడ్డ తదితర ఆరు గ్రామాల్లో 32 మంది బడిఈడు పిల్లలను గుర్తించి, ఇక్కడ పాఠశాల ఏర్పాటుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదించామన్నారు. ఉపాధ్యాయ వలంటీర్ పోస్టుకు అయిదుగురు అభ్యర్థుల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో అర్హత కలిగిన భణిశెల సురేష్‌ను నియమించామన్నారు. తమ పర్యవేక్షణలో ఇక్కడ చిన్నారుల విద్యాభ్యాసం మెరుగుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. ఇక్కడ పాఠశాల మంజూరుపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ తెలిపారు.

## మద్యం మత్తులో ఇద్దరు మహిళలపై దాడి

యువకుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు



ధ్వంసమైన వ్యాన్ అద్దం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దేవి

రావికమతం: మద్యం మత్తులో టాటా ఏస్ వ్యాన్ అద్దాలు బద్దలుగొట్టడమే కాక అడ్డుకున్న ఇద్దరు మహిళలపై దాడి చేసి తీవ్రగాయాల పాల్జేసిన యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కొత్తకోట ఎస్ఐ విభీషణరావు సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి. కొత్తకోట గ్రామానికి చెందిన కొంకుపూడి సాయి ఈ నెల 2న పూటుగా మద్యం సేవించి బైక్‌పై అతివేగంతో తిరిగాడు. అదే సమయంలో అటుగా వచ్చిన ఒక టాటా ఏస్ వాహనాన్ని అడ్డుకున్నాడు. డ్రైవర్ సోమశేఖర్ హారన్ వేస్తూ సైడివ్వమనడంతో కోపోద్రిక్తుడైన సాయి ఆవేశంతో వ్యాన్ అద్దాలను బద్దలుగ్గొట్టాడు. దీంతో డ్రైవర్ సోమశేఖర్‌తో పాటు ఆ వాహనంలో ఉన్న పలువురు మహిళలు వ్యాన్ దిగి అనవసర గొడవ ఏంటంటూ నిలదీయడంతో మరింత రెచ్చిపోయిన సాయి వారిపై దాడి చేశాడు. డ్రైవర్ సోమశేఖర్‌ను, గెంజి దేవి అనే మహిళను దవడపై కొట్టాడు. దేవికి చెవి వద్ద తీవ్ర గాయమైంది. మరో మహిళ కోట రమణమ్మను బలంగా తోసేయడంతో ఆమెకు కాలి మోకాలు వద్ద విరిగి పోయింది. గాయాలపాలైన వారిద్దరినీ చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించామని, దాడికి పాల్పడ్డ సాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ విభీషణరావు తెలిపారు.

## అభిమానుల సంతోషంతోనే నేను 'ఖుషి'

- వంద మందికి లక్ష చొప్పున రూ.కోటి అందిస్తా..
- ఖుషి విజయోత్సవ సభలో హీరో విజయ్ ప్రకటన



మాట్లాడుతున్న విజయ్ దేవరకొండ

బీచ్‌రోడ్డు: తన సంపాదన నుంచి అభిమానులకు రూ.కోటి విరాళం అందిస్తానని హీరో విజయ్ దేవరకొండ ప్రకటించారు. ఖుషి చిత్రం విజయోత్సవ సభను సోమవారం గురజాడ కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ ఖుషి సినిమా ఘన విజయం సాధించిన నేపథ్యంలో నన్ను అభిమానించే కుటుంబాలు కూడా సంతోషంగా ఉండాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఇందుకోసం ఓ ఫారం విడుదల చేస్తానని, డబ్బులు అవసరం అనుకున్న వారు ఈ ఫారం నింపి పంపించాలని సూచించారు. వచ్చిన దరఖాస్తుల్లో వంద మందిని ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున అందజేస్తానని చెప్పారు. అభిమానులు ఇచ్చే ప్రేమ చాలా గట్టిగా తగులుతుందన్నారు. ఫేక్ రేటింగ్‌లు, ఫేక్ రివ్యూలు దాటుకుని ఖుషి సినిమా విజయం సాధించడానికి అభిమానులే కారణమన్నారు. మూడు రోజులుగా అభిమానుల ముఖంలో చిరునవ్వులతో నేను చాలా ఖుషీగా ఉన్నానని చెప్పారు. ఇప్పటి వరకు డబ్బు, కుటుంబం కోసం పని చేశానని, ఇక నుంచి అభిమానుల సంతోషం కోసం పనిచేస్తానన్నారు. 'నాకు ఖుషి మీరు కనబడితే.. నాకు ఖుషి మీ అరుపులు వినబడితే' అంటూ పాట పాడి అభిమానుల్లో హుషారెత్తించారు. దర్శకుడు శివ నిర్వహణ మాట్లాడుతూ అర్జున్‌రెడ్డి చిత్రం చూసిన తర్వాత ఆర్.కె.బీచ్‌లో నడుచుకుంటూ విజయ్‌తో సినిమా చేయాలని కలగన్నానని, ఆ కల ఖుషితో నెరవేరిందన్నారు. ప్రేమలో అభిప్రాయాలు, మతాలు, కులాలు అనే తేడా ఉండొచ్చు గానీ.. మనుషులంతా ఒక్కటే అని సందేశంతో ఈ సినిమా రూపొందించినట్లు చెప్పారు. కుటుంబ మొత్తం చూసే సినిమా ఖుషి అన్నారు. విజయోత్సవ సభలో సంగీత దర్శకుడు హేషామ్ అబ్దుల్ వహాబ్, నిర్మాతలు పాల్గొన్నారు.